సాక్షి బాపట్ల

శనివారం । 4 । అక్టోబర్ । 2025



మిషన్ వాత్సల్యపై అవగాహన

ముప్పాళ్ల: పల్నాడు జిల్లా ముప్పాళ్లలో మిషన్ వాత్సల్యపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలను కో–ఆర్డినేటర్ సంతోష్ వివరించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,01,210 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 1,85,107 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు ప్రస్తుత నిల్వ 42.1600 టీఎంసీలు.



కొండ చిలువ కలకలం

కొల్లూరు: కరకట్ట దిగువున పెసర్లంక నక్కపాయ గండి వద్ద శుక్రవారం కొండ చిలువ కనిపించింది. వరద నీటిలో కొట్టుకు వచ్చిన దీన్ని చూసి స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

న్యూస్‌రీల్

బగళాముఖిని దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి



చందోలు(కర్లపాలెం): చందోలులోని బగళాముఖి అమ్మవారి ఆలయంలో జరిగిన దేవీ శరన్నవరాత్రుల ముగింపు పూర్ణాహుతి కార్యక్రమంలో గురువారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి చల్లా గుణరంజన్ కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు చేశారు. తొలుత ఆలయ ఈవో నరసింహమూర్తి, ఆలయ పూజారులు న్యాయమూర్తి కుటుంబ సభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయానికి తీసుకువచ్చారు. అమ్మవారి పూజా కార్యక్రమాల అనంతరం న్యాయమూర్తి దంపతులకు వేద ఆశీర్వచనంతోపాటు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

లలిత పరమేశ్వరిగా బగళాముఖి అమ్మవారు



చందోలు(కర్లపాలెం): దేవీ శరన్నవరాత్రులలో భాగంగా 11వ రోజు గురువారం చందోలు బగళాముఖి అమ్మవారు లలితా పరమేశ్వరి అలంకారంలో పూజలందుకున్నారు. సాధారణ భక్తులతో పాటు కొంత మంది అధికారులు, ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ముగింపు ఉత్సవాలలో భాగంగా కళ్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ బాలా త్రిపుర సుందరి ఆధ్వర్యంలో 45మంది చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు.

కూటమి నాయకుల రేషన్ దందా

- నాగులుప్పలపాడులో బియ్యం లారీ పట్టివేతతో వెలుగులోకి..
- బాపట్ల జిల్లాకు చెందిన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేల సహకారంతో రెచ్చిపోతున్న బియ్యం మాఫియా
- జనసేన నాయకుడు వక్కలగడ్డ సుధీర్, టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి యథేచ్ఛగా బియ్యం వ్యాపారం
- ఒంగోలుకు చెందిన టీడీపీ కార్పొరేటర్‌తో పాటు మరో టీడీపీ కార్పొరేటర్ భర్త పేరును తప్పించిన వైనం
- ఒంగోలు, బాపట్ల జిల్లాలకు చెందిన టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్లు గుసగుసలు
- బియ్యం సమాచారమిచ్చింది టీడీపీ స్థానిక నాయకులేనని ప్రచారం



సాక్షి ప్రతినిధి, ఒంగోలు: నాగులుప్పలపాడు మండలంలో పోలీసులకు పట్టుబడిన రేషన్ బియ్యం లారీ విషయంతో కూటమి నాయకుల చీకటి దందా వెలుగులోకి వచ్చింది. బాపట్ల నుంచి వయా నాగులుప్పలపాడు మీదుగా కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని నాగులుప్పలపాడు పోలీసులు పట్టుకుని సీజ్ చేయడం సంచలనం సృష్టించింది. బాపట్లలో రేషన్ బియ్యంతో లారీ బయలుదేరినట్లు నాగులుప్పలపాడు ఎస్‌ఐ షేక్ రజియా సుల్తానాకు శుక్రవారం ఫోన్ వచ్చింది. వెంటనే ఆమె రంగంలోకి దిగారు. ఉప్పుగుండూరు వద్ద పోలీసులను చూసిన లారీ వేగం పెంచి తప్పించుకునే ప్రయత్నం చేయడంతో సినిమా తరహాలో చేజ్ చేసిన ఎస్సై రజియా సుల్తానా బృందం నాగులుప్పలపాడు నుంచి ఇంకొల్లు వెళ్లే దారిలో లారీని అడ్డుకున్నారు. అందులో రేషన్ బియ్యం ఉండటంతో స్వాధీనం చేసుకున్నారు. 50 కిలోల బస్తాలు 720 ఉన్నట్లు లెక్కతేల్చారు. ఇక్కడే కథ కీలక మలుపు తిరిగింది.

ఎస్సైకు సమాచారం ఇచ్చిందెవరు?

రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతోందని నాగులుప్పలపాడు ఎస్సైకి సమాచారం ఎవరిచ్చారు.. ఎందుకు ఇచ్చారన్న దానిపై జిల్లాలో చర్చ జరుగుతోంది. మండల టీడీపీలోని రెండు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు జరుగుతోంది. ఒక గ్రూపునకు చెందిన టీడీపీ నాయకులు ఎస్సైకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. నాగులుప్పలపాడు మండలంలో టీడీపీకి చెందిన ఒక రేషన్ వ్యాపారి ఈ బియ్యాన్ని కృష్ణపట్నం పోర్టుకు తరలిస్తున్నట్లు టీడీపీ స్థానిక నాయకులకు సమాచారం వచ్చినట్లు తెలిసింది. దీంతో వారు ఎస్సైకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. అయితే, బియ్యం పట్టుబడిన తర్వాత అసలు విషయం బయటపడింది. దాంతో పోలీసులతో సహా టీడీపీ స్థానిక నాయకుల పరిస్థితి కుడితిలో పడిన ఎలుక చందంగా తయారైందని సమాచారం.

కూటమి నాయకుల చీకటి వ్యాపారం...

నాగులుప్పలపాడులో పోలీసుల దాడిలో దొరికిన రేషన్ బియ్యం వెనుక ఉంది బాపట్ల, ఒంగోలుకు చెందిన టీడీపీ నాయకులేనని సమాచారం. బాపట్లకు చెందిన జనసేన నాయకుడు వక్కలగడ్డ సుధీర్, బాపట్లకే చెందిన టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డితోపాటు ఒంగోలు నగరపాలక సంస్థకు చెందిన ఒక టీడీపీ కార్పొరేటర్, మరో టీడీపీ కార్పొరేటర్ భర్త, మరికొందరు టీడీపీ, జనసేన నాయకులు రేషన్ బియ్యాన్ని కృష్ణపట్నం తరలిస్తున్నట్లు తెలిసింది. నాగులుప్పలపాడు పోలీసులు మాత్రం బాపట్ల జనసేన నాయకుడు సుధీర్, టీడీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి, లారీ డ్రైవర్ నాగరాజులపై మాత్రమే కేసు నమోదు చేశారు. ఒంగోలుకు చెందిన టీడీపీ కార్పొరేటర్, మహిళా కార్పొరేటర్ భర్త పేరును కేసు నుంచి తప్పించినట్లు ప్రచారం జరుగుతోంది. నాగులుప్పలపాడు మండల మాజీ అధ్యక్షుడు వీరయ్య చౌదరి హత్య కేసుతో సంబంధం ఉన్నట్లు అనుమానించి పోలీసులు విచారించిన పలువురు టీడీపీ నాయకులకు కూడా ఇందులో ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. బాపట్ల జిల్లాకు చెందిన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేల సహకారంతో మద్దిపాడు మండలంలో ఒక రైస్ మిల్లు అద్దెకు తీసుకున్న సుధీర్, సుధాకర్‌రెడ్డి ముఠా రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు సమాచారం.

అన్నదాతకు గుండె కోత

- కృష్ణా వరదలతో నీట మునిగిన పంట పొలాలు
- వేలాది ఎకరాలలో వాణిజ్య పంటలకు నష్టం



వరద నీట మునిగిన పసుపు, అరటి పంటలు

కొల్లూరు: కృష్ణా నది వరదలతో అన్నదాత గుండె కోతకు గురైంది. వరద తాకిడి కారణంగా కృష్ణా నదీ పరివాహక గ్రామాలలో వాణిజ్య పంటలు ముంపు బారిన పడి రైతులకు అపార నష్టం వాటిల్లింది. కృష్ణా నదిలో శుక్ర వారం వరద ప్రవాహం భారీగా తగ్గింది. వేలాది ఎకరాలలో సాగుచేసిన అరటి, పసుపు, కంద, తమలపాకు, జామ, మినుము, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. పల్లపు భూములలో ఇప్పటికీ నీరు నిల్వ ఉంది. నీటిని మళ్లించడానికి రైతులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. తిప్పలకట్ట ప్రాంతంలో నది అంచున ఉన్న పంట భూములు భారీగా కోతకు గురవుతుండటంతో ఆప్రాంత రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో 2,980 హెక్టార్లలో వాణిజ్య పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చినప్పటికీ నష్ట తీవ్రత అధికమయ్యే అవకాశాలున్నట్లు రైతులు చెబుతున్నారు.

మా జీవనాధారాన్ని దెబ్బతీయకండి సారూ..

- సీ మౌత్‌ను యథాస్థానంలోనే కొనసాగించండి
- పారదర్శకంగా స్ట్రయిట్ కట్ సమస్య పరిష్కరించాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్‌కు మత్స్యకారుల వినతి



మత్స్యకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్,

చీరాలటౌన్: గంగమ్మ తల్లిని నమ్ముకుని ప్రాణాలను పణంగా పెట్టి బతుకు పోరాటం చేసే తమపై టీడీపీ నేత బుర్ల వెంకట్రావు, కొందరు రియల్టర్లు సీ మౌత్‌ను పూడ్చి మా జీవనాధారాన్ని దెబ్బతీశారని.. దానిని యథాస్థానంలోనే ఉంచాలంటూ తీరప్రాంత మత్స్యకారులు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు తేల్చి చెప్పారు. శుక్రవారం చీరాల ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ టి. చంద్రశేఖరనాయుడు ఆధ్వర్యంలో సీ మౌత్ సమస్యపై చీరాల–బాపట్ల రెవెన్యూ, పోలీస్, మత్స్యశాఖ అధికారులు, తీరప్రాంత గ్రామాల మత్స్యకారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మత్స్యకార సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు కలెక్టర్ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. దీనిపై కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్ సమస్యను పారదర్శకంగా పరిష్కరించుకుందామని మత్స్యకారులకు సూచించారు. అధికారులు సీ మౌత్ ప్రాంతాన్ని పరిశీలించి తగిన ఆధారాలతో పది రోజుల్లో నివేదికలు అందించాలని కోరారు. 1972లోని కాలువ నిర్మాణంతోపాటు 1980, 1990, 2000 సంవత్సరాల శాటిలైట్ చిత్రాలను కూడా పొందుపర్చాలన్నారు. స్ట్రయిట్‌కట్ కాలువ ఒంపుగా ఉంటేనే మత్స్యకారులకు మేలు జరుగుతుందని కమిటీ సభ్యులు ఎరిపిల్లి రమణ, కాంతారావు, నారాయణ, కనరాజు, డేవిడ్ కలెక్టర్‌కు వివరించారు. ఆర్డీవోలు చంద్రశేఖరనాయుడు, గ్లోరియా, డీఎస్పీలు మొయిన్, శ్రీనివాసులు, మత్స్యశాఖ జేడీ శ్రీనివాస్‌నాయక్, తహసీల్దార్లు కె.గోపికృష్ణ, షలీమా పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ సీఈసీ సభ్యునిగా 'వరికూటి'

చీరాల అర్బన్: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) సభ్యునిగా చీరాలకు చెందిన డాక్టర్ వరికూటి అమృతపాణిని పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను వేమూరు నియోజకవర్గ పార్టీ నాయకులు కలసి అభినందనలు చెప్పారు.

జీఎస్టీ తగ్గింపుతో పేద వర్గాలకు మేలు



నగరం: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వలన పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని జీఎస్టీ డెప్యూటీ కమిషనర్ ఎం.కనికిరెడ్డి చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జీఎస్టీ సేవింగ్స్‌పై గ్రామ సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. నిత్యావసరాలపై జీఎస్టీ భారీగా తగ్గినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ రమేష్‌బాబు, విద్యుత్‌శాఖ ఏఈ నాగుల్‌మీరా పాల్గొన్నారు.

నేర నియంత్రణకు చర్యలు

ఎస్పీ బి.ఉమామహేశ్వర్

బాపట్ల: బాపట్ల జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణకు డ్రోన్ నిఘా ఏర్పాటు చేయాలని జిల్లా పోలీసులను జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశించారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాల ద్వారా సముద్రతీర పర్యాటక ప్రదేశాల్లో, శివారు ప్రాంతాలలో శుక్రవారం నిఘా ఏర్పాటు చేయించారు. సూర్యలంక, రామాపురం, వాడరేవు తదితర సముద్ర తీర ప్రాంతాలలో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారని ఎస్పీ చెప్పారు. అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయడమే ప్రధాన లక్ష్యంగా నిఘా కోసం డ్రోన్లను వినియోగిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్ 112 కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.

మందుగుండు సామగ్రి విక్రేత అరెస్ట్

రేపల్లె: నిబంధనలకు విరుద్ధంగా మందుగుండు సామగ్రి తయారు చేసి విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పట్టణ సీఐ మల్లికార్జునరావు అందించిన వివరాలు.. మండలంలోని పేటేరు గ్రామానికి చెందిన కంబాల ప్రభాకరరావు మందుగుండు సామగ్రిని తయారు చేసి, విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. తనిఖీ నిర్వహించి, అతడిని అదుపులోకి తీసుకున్నారు. మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మందుగుండు సామగ్రి తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 94407 96169 నంబరులో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

టీడీపీలో రెండు వర్గాల ఘర్షణ

- ఓ వర్గంపై మరో వర్గం దాడి
- నడి రోడ్డుపై ఎమ్మెల్యే సాక్షిగా ఘర్షణ
- పలువురికి గాయాలు, ఓ పోలీసుకు స్వల్ప గాయాలు



కొల్లూరులో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సమక్షంలో ఘర్షణ పడుతున్న కార్యకర్తలు

కొల్లూరు: తెలుగు తమ్ముళ్ల రెచ్చిపోయారు. టీడీపీ అంతర్గత విభేదాలు రచ్చకెక్కాయి. ఎమ్మెల్యే సాక్షిగా తన్నులాటకు దారితీసింది. కొల్లూరులో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీ, మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్ వర్గాల నడుమ మాటల యుద్ధం జరిగింది. కొల్లూరు ఎంప్లాయిస్ రిక్రియేషన్ హోమ్‌లో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీకి వచ్చారు. ఆ సమయంలో మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్‌ను లక్ష్యంగా చేసుకొని అనంతవరానికి చెందిన నాయకుడు అనుచరులు అవాకులు, చవాకులకు దిగారు. కనగాల వర్గం నాయకులు స్థానిక బస్టాండ్ సెంటర్లో ప్రభుత్వ కార్యక్రమం జీఎస్టీ సమావేశం వద్దకు వెళ్లారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సాక్షిగా జీఎస్టీ సమావేశం ప్రారంభమవుతున్న సమయంలో ఇరువర్గాల నడుమ మరోసారి వాగ్వాదం చోటుచేసుకుంది. ఒక వర్గంపై మరో వర్గం బాహాబాహీకి దిగి పిడి గుద్దులు, చేతి కందిన కుర్చీలు, హెల్మెట్లతో పరస్పరం దాడులకు దిగారు. సర్దుబాటు చేసేందుకు ఎమ్మెల్యే చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

టీడీపీ వర్గాల నడుమ దాడులను సెల్ ఫోన్‌లలో చిత్రీకరిస్తున్న విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే, కొట్లాట విషయం పక్కన పెట్టి వీడియోలు తీయడం ఆపించాలని పోలీసులకు హుకుం జారీ చేయడంతో వారు మీడియా ప్రతినిధుల నుంచి ఫోన్‌లు లాక్కొని వీడియోలను డిలీట్ చేశారు. తెలుగు తమ్ముళ్ల తన్నులాటలో టీడీపీ మండల అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ కింద పడిపోవడంతో ఎమ్మెల్యే ఆనందబాబు పరిస్థితిని అదుపు చేసేందుకు విశ్వప్రయత్నం చేయాల్సి వచ్చింది.

ఆస్పత్రికి క్షతగ్రాతుల తరలింపు



గాయపడిన క్షతగాత్రులను 108లో వైద్యశాలకు తరలిస్తున్న సిబ్బంది

కొల్లూరు: టీడీపీలోని రెండు వర్గాలు పరస్పరం దాడులకు పాల్పడడంతో పలువురు గాయపడ్డారు. ఇరువర్గాలకు చెందిన క్షతగాత్రలను 108లో తెనాలి వైద్యశాలకు తరలించారు. ఘర్షణ నేపథ్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పలువురికి గాయాలు

టీడీపీ వర్గీయుల కొట్లాటను తాత్కాలికంగా సద్దుమణిచి రెండు ముక్కలలో జీఎస్టీ సమావేశాన్ని ముగించిన ఎమ్మెల్యే ఆనందబాబు అక్కడ నుంచి జారుకున్నారు. అనంతరం తిరిగి మళ్లీ ఒకరిపై ఒకరు దాడులకు తెగబడ్డారు. అనంతవరానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు కనగాల మధుసూదన్ ప్రసాద్‌ను దూషిస్తున్నాడన్న కారణంతో ఆయన అనుచరులు అతడిపై దాడికి పాల్పడ్డారు. అనంతరం కనగాల మధుసూదన్ ప్రసాద్ వర్గానికి చెందిన ఓ యువకుడు ఒంటరిగా ఓ మెడికల్ షాప్ వద్ద ఉండటాన్ని గమనించిన మైనేని మురళీకృష్ణ వర్గీయులు అతడిపై దాడికి పాల్పడ్డారు. దీనికి ప్రతిగా కనగాల మధుసూదన్ ప్రసాద్ వర్గీయులు మైనేని వర్గీయులపై దాడులకు దిగడంతో పలువురు గాయల పాలయ్యారు. వీరి మధ్య కొట్లాట నెలకొన్న పరిస్థితుల్లో వారిని అదుపు చేసేందుకు వెళ్లిన ఓ పోలీసుకి దెబ్బల బారిన పడ్డాడు. పరిస్థితిని అదుపు చేసేందుకు వేమూరు సీఐ పీవీ ఆంజనేయులు, కొల్లూరు ఎస్ఐ జానకీ అమరవర్ధన్ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది.

స్థానిక సంస్థల అధికారాలు నిర్వీర్యం

మాజీ ఐఏఎస్ అధికారి విజయకుమార్



సభలో మాట్లాడుతున్న మాజీ ఐఏఎస్ అధికారి

చీరాల రూరల్: స్థానిక సంస్థల అధికారాలను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ పేర్కొన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో గ్రామ స్వరాజ్యం, స్థానిక సంస్థలు, నిధులు, విధులు, అధికారాలు అంశాలపై గురువారం రాత్రి సమావేశం నిర్వహించారు. కొత్తపేట మాజీ సర్పంచి చుండూరి వాసు అధ్యక్షత వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యం పల్లెల్లో మచ్చుకైనా కనిపించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో మండల వ్యవస్థ రాక ముందు పంచాయతీలు, సమితులు, జిల్లా పరిషత్‌లకు చెప్పుకోదగిన అధికారాలు ఉండేవని చెప్పారు. ప్రస్తుతం పంచాయతీరాజ్ వ్యవస్థ కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల కంటే మన రాష్ట్రం ఎంతో వెనుకబడి ఉందని చెప్పారు. కొన్ని ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన గిరిజనులు, ఎస్సీలకు చెందిన సర్పంచి పదవులను అగ్రవర్ణాలకు చెందినవారు దర్జాగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తున్నాయని మండిపడ్డారు. నక్సలైట్ల ఏరివేత పేరుతో కగార్ ఆపరేషన్ చేపట్టి అడవుల్లో బతుకుతున్న గిరి పుత్రులను వెళ్లగొట్టి ఆయా భూములను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం యత్నిస్తోందని చెప్పారు. రామాయపట్నం వద్ద పోర్టు పరిసరాల్లోని పేదల భూములను పెత్తందారులు కారుచౌకగా కొట్టేశారని చెప్పారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన ప్రజలు పార్టీల పేరుతో విడిపోయినంత కాలం అగ్రవర్ణాలవారు ఆధిపత్యాన్ని చెలాయిస్తునే ఉంటారని అభిప్రాయపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇచ్చిన ఓటు హక్కుతో బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఐకమత్యంలో మనఓట్లు మనం వేసుకుంటూ రాజ్యాధికారం సాధించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సభ కన్వీనర్ చుండూరి వాసు, మాచర్ల మోహనరావు, నల్లబోతుల మోహన్‌కుమార్ ధర్మా, గోసాల ఆశీర్వాదం, మాచవరపు జూలియన్, గవిని శ్రీనివాసరావు, ఊటుకూరి వెంకటేశ్వర్లు, దామర్ల శ్రీకృష్ణ, శీలం రవి, జ్యోతి రమేష్, బత్తుల శామ్యూల్, మల్లెల బుల్లిబాబు, రిటైర్డు ఏసీపీ కట్ట రాజ్‌వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు 'ఆటో డ్రైవర్ల సేవలో..' ప్రారంభం

తాడేపల్లి రూరల్: 'ఆటో డ్రైవర్ల సేవలో.. ' పథకాన్ని శనివారం ప్రారంభించనున్నట్లు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. తాడేపల్లి పరిధిలోని సీతానగరం ప్రకాశం బ్యారేజ్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఉదయం 9.30 గంటలకు స్వయంగా ఆటో ఎక్కి పథకాన్ని ప్రారంభించనున్నారని పేర్కొంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ హాజరవుతారు.

జిల్లాలో 3,193 మంది లబ్ధిదారులు

గుంటూరు వెస్ట్: జిల్లాలో 13,193 మంది ఈ పథకం కింద లబ్ధి పొందనున్నారని కలెక్టర్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో చేబ్రోలు మండలంలో 453, దుగ్గిరాల 344, గుంటూరు అర్బన్ 5,078, గుంటూరు రూరల్ 319, కాకుమాను 131, కొల్లిపర 164, మంగళగిరి 516, మేడికొండూరు 404, పెదకాకాని 711, పెదనందిపాడు 153, ఫిరంగిపురం 250, పొన్నూరు 530, ప్రత్తిపాడు 281, తాడేపల్లి 383, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ 1038, తాడికొండ 440, తెనాలి 1338, తుళ్లూరు 399, వట్టిచెరుకూరులో 261 మందికి లబ్ధి.

బరి తెగించిన టీడీపీ నేతలు

- చల్లమ్మ అగ్రహారంలో కోడి పందేలు
- చేతులు మారిన లక్షలాది రూపాయలు
- జిల్లా ఎస్పీ ఆదేశాలతో పోలీసుల దాడులు



చల్లమ్మ అగ్రహారంలో ఏర్పాటు చేసిన బరిలో కోడిపందేలు వేస్తున్న దృశ్యం

నగరం: టీడీపీ నాయకులు బరి తెగించారు. మండలంలోని చల్లమ్మఅగ్రహారం మామిడి తోటల్లో గురువారం జోరుగా కోడి పందేలు వేశారు. వేకువజాము నుంచే కోడిపందేలు వేయడంతో భారీ సంఖ్యలో జనసందోహం హాజరయ్యారు. నిర్వాహకులు పందేలు చేసేందుకు వచ్చిన వారి నుంచి రూ.200 వసూలు చేసినట్లు సమాచారం. ఉదయం ఆరు నుంచి 10 గంటల వరకు జోరుగా కోడిపందేలు నిర్వహించారు. లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు సమాచారం. కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు జిల్లా ఎస్పీ కార్యాలయానికి సమాచారం అందించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నగరం పోలీసులు ఉదయం 10.30 గంటల సమయంలో కోడిపందేల బరి వద్దకు వెళ్లారు. నిర్వాహకులను వదిలి చూసేందుకు వచ్చి వారిపై కేసులు నమోదు చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోడిపందేల శిబిరంపై దాడులు చేసి 14 మంది జూదరులు, మూడు కోడి పుంజులు, ఏడు ద్విచక్రవాహనాలతోపాటు రూ.8760 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భార్గవ్ తెలిపారు.

నూజిళ్లపల్లిలో పండుగ కళ కరవు

- గ్రామోత్సవం నిర్వహణపై పూజారులు, ధర్మకర్తల నడుమ వివాదం
- గ్రామంలో మోహరించిన పోలీసులు
- ఫలించని రాజీ ప్రయత్నాలు
- ఆలయానికి తాళాలు
- ఇళ్లకే పరిమితమైన గ్రామస్తులు



పూజారులతో మాట్లాడుతున్న డీఎస్పీ మహమ్మద్ మొయిన్



గ్రామంలో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు

జె.పంగులూరు: పండగ వేళ పూజలతో కళకళలాడాల్సిన ఇళ్లు బోసిపోయాయి. మేళతాళాలతో మారుమోగాల్సిన వీధులన్నీ పోలీసుల బూటు చప్పుళ్లతో ధ్వనించాయి. దసరా పర్వదినం రోజైన గురువారం నూజిళ్లపల్లి గ్రామంలో నెలకొన్న పరిస్థితి. వివరాలు.. గ్రామంలో రాజరాజేశ్వరిస్వామి వారి దేవాలయం ఉంది. గతంలో విజయదశమి రోజున గ్రామంలో స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ఎంతో వైభవంగా ఊరేగించి పండగ జరుపుకునే వారు. ఇది పూజార్లు, ధర్మకర్తలు దగ్గర ఉండి నడిపించేవారు. ఇది పదేళ్ల ముందుమాట. కానీ 2017 నుంచి గ్రామంలో ఆ పరిస్థితులు లేవు. పండగ రోజు కూడా దేవాలయంలో పూజలు, ఊరేగింపులు లేవు. పూజారులంటే ధర్మకర్తలకు పడదు, ధర్మకర్తలు అంటే పూజారులకు పడదు. ఈనేపథ్యంలో గురువారం దేవాలయంలో పూజలు, ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహణపై వివాదం నెలకొంది. వివాదానికి స్వస్తి పలికి గ్రామంలో ప్రశాంతంగా పండగ నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చీరాల డీఎస్పీ మహమ్మద్ మొయిన్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సూర్యప్రకాష్‌రావు, తహసీల్దార్ పి.సింగారావు, పంగులూరు గ్రూపు దేవదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఉపలమర్తి శ్రీనివాసరావు పలుమార్లు పూజారులు, ధర్మకర్తలతో మాట్లాడారు. గురువారం రాత్రి వరకు వివాదం సర్దుమణిగే విధంగా చేయాలని ప్రయత్నించారు. ఆ ప్రయత్నాలు ఫలించలేదు. దేవాలయంలో ఉత్సవ విగ్రహాలు బయటకు తీయాలంటే ధర్మకర్తలే తీయాలని, పూజారుల పూజకు కూడా ధర్మకర్తలు ఒప్పుకోలేదు. సమస్య పరిష్కారమయ్యే వరకు తాము అంగీకరించబోమని ధర్మకర్తలు దేవాలయం గడప వద్ద కూర్చున్నారు. ధర్మకర్తలు ఆలయంలో ఉత్సవ విగ్రహాలు బయటకు తీస్తేనే పూజ చేస్తామని పూజారులు భీష్మించుకొని కూర్చున్నారు. పలుమార్లు అధికారులు ఇరువురితో మాట్లాడినా ఫలితం లేకుండా పోయింది. అధికారులు రాత్రి 9 గంటల తర్వాత దేవాలయానికి తాళాలు వేయించి వెనుతిరిగి వెళ్లిపోయారు.

భారీ పోలీసు బందోబస్తు

దసరా పండుగ వేళ గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఒక డీఎస్పీ, నలుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్సైలు, 130 మంది పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, దేవదాయ శాఖ సిబ్బంది గ్రామానికి చేరుకున్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా గ్రామంలోని ప్రజల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య ప్రజలు ఎవరూ ఇల్లు వదిలి బయటకు రాలేదు.

వివాదానికి కారణం భూములు?

దేవాలయానికి 31 ఎకరాల భూమి ఉంది. వాటిలో పూజారులకు 21 ఎకరాలు, ధర్మకర్తలకు మూడు ఎకరాలు, స్వస్తి వాచకులకు నాలుగు ఎకరాలుగా ఉండేదని సమాచారం. అయితే 31 ఎకరాలు పూజారులే అనుభవిస్తున్నారనేది వివాదానికి ప్రధాన కారణం. వివాదాలతో దేవాలయంలో నిర్వహించాల్సిన కార్యక్రమాలు నిలిచిపోయాయి. గ్రామస్తుల్లో కొంత మంది పూజారుల వైపు, మరికొంత మంది ధర్మకర్తల వైపు ఉండిపోయారు. రాజకీయరంగు పూసుకుంది.

ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇస్సాక్



ఇస్సాక్‌కు నియామక పత్రాలు అందిస్తున్న ఎన్నికల అధికారి

బాపట్ల: ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా జి.ఇస్సాక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా ఎన్నికలను ఎన్నికల అధికారిగా సిహెచ్.శేషుబాబు వ్యవహరించారు. ఎన్నికల్లో జి.ఇస్సాక్, డి.రాజేష్ తరపున 18 మంది నామినేషన్లు వేశారు. వీరిలో జి.ఇస్సాక్‌కు సంబంధించిన ప్యానల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహాయ ఎన్నికల అధికారులుగా కె.సాంబశివరావు, కె. కిరణ్ కుమార్, ముఖ్య అతిథులుగా బాపట్ల జిల్లా చైర్మన్ పి.నాగేశ్వరరావు, కన్వీనర్ బి.ప్రసాద్‌రావు హాజరై కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

జిల్లా అధ్యక్షుడు ఏకగ్రీవం

జిల్లా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులుగా జి.ఇస్సాక్, గౌరవ అధ్యక్షులు యు.నరసింహారావు, ఉపాధ్యక్షులుగా పి.సంధ్యా రాణి, ఎ.జాషువా, షేక్.ఎం.సుభానీ, పి.అన్వేషన్, వై.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా బి.రాజేష్, జాయింట్ సెక్రటరీలుగా చంద్రకాంత్, నాగూర్‌షరీఫ్, ఎం.శ్రీనివాసరావు, పి.వి.నవీన్, శ్యామ్యూల్‌రాజ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.శేషగిరిరావు, జాయింట్‌సెక్రటరీ వై.సృజనకుమారి, ట్రెజరర్ ఖాదర్‌బాషా, కో ఆప్షన్ సభ్యులు కె.పవన్‌వెంకట కుమార్, రత్నశేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి



వెంకటసుబ్బారావు మృతదేహం



ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీ

మేదరమెట్ల: బైక్‌ను కారు ఢీకొని భార్యాభర్తలు మృతి చెందిన ఘటన కొరిశపాడు మండల పరిధిలోని వెంకటాపురం క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. జె.పంగులూరు మండలం అలవలపాడు గ్రామానికి చెందిన కొత్తూరు వెంకటసుబ్బారావు(55), భార్య లక్ష్మి(50)తో మోటారు బైకుపై ఒంగోలు వెళ్లి తిరిగి స్వగ్రామం వస్తున్నాడు. వెంకటాపురం క్రాస్ వద్దకు రాగానే బైక్‌ను అలవలపాడు రోడ్డులోకి వెళ్లేందుకు మలుపు తిప్పుతుండగా ఇదే సమయంలో నెల్లూరు నుంచి ఏలూరు వెళ్తున్న కారు బైక్‌ను ఢీ కొంది. దీంతో బైక్‌పై ఉన్న భార్యాభర్త రోడ్డుపై పడిపోయారు. ఇద్దరి తలలకు తీవ్ర గాయాలు కాగా అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం తెలుసుకున్న మేదరమెట్ల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను సేకరించారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ మహ్మద్ రఫీ కేసు నమోదు చేశారు.

ఇద్దరు యువకులు దుర్మరణం



యువకుల మృతదేహాలను పరిశీలిస్తున్న ఎస్ఐ మహేంద్ర

జరుగుమల్లి(సింగరాయకొండ): దసరా పండగ పూట రెండు కుటుంబాల్లో విషాదం నెలకొంది. రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న టిప్పర్‌ను ప్రమాదవశాత్తు మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఈ ఘటన బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో మండల కేంద్రమైన జరుగుమల్లిలో పాల కేంద్రం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు.. జరుగుమల్లి మండలం చింతలపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన కట్టా ప్రవీణ్(21), చీరాల మండలం వాడరేవు గ్రామానికి చెందిన శ్రీరాములు రాజు(20) ఇద్దరూ కలిసి చింతలపాలెం నుంచి టంగుటూరుకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు మార్జిన్‌లో నిలిపి ఉంచిన టిప్పర్ వెనుక భాగాన్ని ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.మహేంద్ర తెలిపారు.

సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులు

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: సమాజానికి మార్గదర్శకులుగా ఉపాధ్యాయులు ఉండాలని జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక బాపట్ల ఫార్మసీ కాలేజీలో డీఎస్సీ 2025 లో ఎంపికైన ఉపాధ్యాయులకు ఎనిమిది రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రెండు తరాల పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులుగా ప్రయాణం ప్రారంభించి న మీరు ముందు శిక్షణ తీసుకొని పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని చెప్పారు. తాను చిన్నప్పుడు చదువుకున్న ఉపాధ్యాయులను ఇప్పటికే నేను మర్చిపోలేదని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పిల్లలు గురువు స్థానాన్ని ఎన్నటికీ మర్చిపోలేరని ఆయన చెప్పారు. నూతనంగా ఎంపికై న ఉపాధ్యాయులు మిమ్ములను తీర్చిదిద్దుకుని పవిత్రంగా ఉద్యోగం చేయాలని అని సూచించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు భాగస్వామ్యం కావాలని కోరారు. బాపట్ల జిల్లాకు డీఎస్సీ ద్వారా 485 మంది ఉపాధ్యాయులు ఎంపికకాబడ్డారని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, సార్వ శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌వ్యాధిపై విస్తృత ప్రచారం చేపట్టాలి

బాపట్ల: జిల్లాలో ఎయిడ్స్ వ్యాధిపై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఆరోగ్య ప్రచార రథాన్ని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలందరికీ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యపరమైన వైద్య పరీక్షలు చేయించుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విజయమ్మ పాల్గొన్నారు.

క్యారవాన్ బస్సుతో ప్రత్యేక అనుభూతి

బాపట్ల: జిల్లాకు వచ్చే పర్యాటకులు అద్భుతమైన అనుభూతి పొందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రాంగణంలో క్యారవాన్ బస్సును పరిశీ లించారు. పర్యాటక అభివృద్ధి దిశగా క్యారవాన్ టూరిజం రాబోయే రోజుల్లో నూతన వరవడిని చూపుతుందని అన్నారు. జిల్లాలో క్యారవాన్ టూరిజం అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. క్యారవాన్ బస్ సౌకర్యాలను జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. క్యారవాన్ వాహనాన్ని సూర్యలంక బీచ్‌లో పర్యాటకుల సందర్శన కోసం శని, ఆదివారాలలో ఉంచుతామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నాగిరెడ్డి, టూరిజం శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోపెడ్‌ను ఢీ కొన్న బైక్.. ముగ్గురికి తీవ్ర గాయాలు



బైకుల ప్రమాదంలో గాయపడిన వ్యక్తులు

మేదరమెట్ల: ముందు వెళుతున్న టీవీఎస్ మోపెడ్‌ను వెనుక నుంచి వచ్చిన మోటారు బైకు ఢీ కొన్న సంఘటన మేదరమెట్ల పోలీసు స్టేషన్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. కొరిశపాడు మండలం యర్రబాలెం నుంచి మేదరమెట్లకు టీవీఎస్‌పై ఇద్దరు వ్యక్తులు వస్తున్నారు. మోపెడ్ జాతీయ రహదారిపై పోలీసు స్టేషన్ సమీపానికి రాగానే వెనుక నుంచి వచ్చిన బైకు ఢీ కొంది. దీంతో రెండు వాహనాలపై ఉన్న ముగ్గురు రోడ్డుపై పడిపోగా వీరికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.